"ఆరుగురిచేత వంచింపబడ్డాడు మహారథి కర్ణుడు. అయితేయేం? ఆఖరిక్షణం వరకు యుద్ధంచేసి, వీరమరణం పొందాడు..."

అరుంధతి జీవితంకూడా అంతే.

"అరుంధతి వెళ్లిపోయిందిట."

"పోయిందా?" అన్నాను తృళ్లిపడి.

నాగమణి వెకిలిగా నవ్వింది. "హుమ్ వెళ్లిపోయింది" అంది.

ఎందుకు వెళ్లిపోయింది? ఎలా వెళ్లిపోయింది? ఎక్కడికి వెళ్లిపోయింది? కాని నాగమణిని అడిగి లాభంలేదు. నాగమణి సరైన జవాబు చెప్పదు సరికదా, పైపెచ్చు అవాకులూ, చెవాకులూ పేల్తుంది...

కాని నాగమణి ఊరుకోదు.

"అత్తగారూ, కోడలూ పేచీపడ్డార్ట." అంది మళ్లీ నవ్వి.





నిడదవోలు మాలతి

అయిదేళ్ళపాటు అత్తింటివార్ని అడ్డాల్లో బిడ్డల్ని సాకినట్టు సాకిన అరుంధతి ఎక్కడికి ఎలా ఎందుకు వెళ్ళిపోయిందో నాకర్థం కాలేదు. ఒక నిర్దుష్టమైన సంస్కారాన్ని అలవరుచుకుని, ఆచరణలో పెట్టి నలుగురిచేత శెభాషనిపించుకున్న అరుంధతి చవకబారు హోటల్లో సర్వరులా, గుడిశల్లో అప్పలమ్మల్లా అత్తగారితో పేచీపడి వెళ్ళిపోయిందంటే ఆమాట నాకర్థం కాలేదు.

"ఏమైనా బలువు మోస్తున్నట్టు నటించడం, బాధ్యతలు తప్పించుకోవడం కొమ్మెత్తే వేళకి భుజం తప్పించడం అదీ ఒక నేర్పే" అంది నాగమణి.

నాగమణికి మహాభారతం చూపించి ఏ"మిటిది?" అనడిగితే ఎర్రట్టశాంకుబుక్కు అని చెప్పగలదు. కుడిచేతి వేళ్ళు రెండూ ఎడంచేతివేళ్ళు రెండూ చూపించి "ఎన్ని?" అంటే "రెండు రెళ్ళు" అంటుంది. కాకపోతే 'నీ రెండు చేతులకీ నాలుగు వేళ్ళున్నాయా?' అని అడుగుతుంది. నాగమణి అంటే నా అభిప్రాయం నాగదంష్ట్రి.

గబగబ నాపని ముగించుకుని వెయిటింగ్ రూమ్‌కి వెళ్ళిపోయాను. అరుంధతితో నాకు పరిచయం రెండేళ్ళ క్రిందట అనుకుంటాను. ఒకరూమ్ అద్దెకు తీసుకుని చదువుకుంటూండే దాన్ని. ఆవేళ ఆదివారం. ఎండ నిప్పులు చెరుగుతూంది. క్లాసుకి సంబంధించిన పుస్తకం ఒకటి పుచ్చుకుని మంచం పక్కా అన్నీ ఏర్పాటుచేసుకుని పడుకున్నాను, చదువుదాం అన్న అభిప్రాయంతో. నిద్రరాకపోయినా, ఎండపాడకి కళ్ళు మూసుకుపోతున్నాయి—నా ప్రమేయమేం లేకుండానే. ఇంటివారి కోడలు 'పాపని' పిలవడం వినిపిస్తూంది - దూరంగా 'పారాహుషార్' అన్నట్టు.

"పాప మీ యింట్లో ఉందాండి?" చేరవేసిన తలుపు ఓరవోంపుగా తోస్తూ ప్రశ్నించింది.

"లేదండీ" అన్నాను, మత్తుగా, మంచం మీంచి లేవకుండానే.

"ఇంతట్లోకి ఎక్కడికి వెళ్ళిపోయిందో" అన్న మాటలు నేపథ్యంలో లీలగా వినిపించి అంతమైపోయాయి.

మళ్లీ "పాపా!", "పాపా", - "మూడో నాలుగో ప్రసారాలు-ఆవిడ ఇంకెవరితోనో ఏదో అన్నట్లు, ఇంకో కొత్త స్వరమూ—

"క్షమించండి. పాప మీ గదిలోకి రావడం నేను చూశాను."

త్రుళ్లి పడి, లేచి "ఫరవాలేదండీ" అన్నాను.

అరక్షణం సేపు-నిద్ర తూలగొడుతూంది. గుమ్మంలో నిలబడిన వ్యక్తి మత్తు తేలగొడుతూంది. లేత ఊదారంగు వాయిల్ చీరా, ముంకెనపువ్వురంగు జాకెట్టూ, మొహంలో స్నిగ్ధచ్ఛాయలు - ఎక్కడైనా చూశానో! చూసినట్టు ఊహిస్తున్నానో!

"మంచి నిద్రలో లేపినట్టున్నాను" - ఆ స్వరంలో క్షమాపణలు ధ్వనించాయి.

"ఆఁ. లేదండీ" అని "లోపలికి రమ్మని" "పాప ఇక్కడికి రావడం నేను చూడలేదండీ" అన్నాను మొదటి ప్రశ్నకి సమాధానంగా. అంటూ మంచం దిగి గదిలో చుట్టూ చూశాను.

"భయపడక్కర్లేదని మీరు చెప్పండి" అంది, ఆవిడ, నా మంచం కిందకి సౌజ్ఞ చేసి చూపిస్తూ. అటువేపు చూశాను. మంచం కిందనుంచి కమలాకుల్లాటి రెండు చిన్న పాదాలు దర్శనమిచ్చిందాకా తన మాటలు నాకు బోధపడలేదు.

నవ్వుతూ ఆ రెండు పాదాలూ మెల్లిగా లాగాను. నా వెనక ఎవరున్నారో పాప చూడలేదు.

"స్. స్. ప్రవేటు మేష్టరు" అంది లక్కపిడతలాటి నోటిమీద మావిడి చివుళ్ళలాటి వేళ్లు కదిలిస్తూ.

"ఏమిటే?"

"ప్రైవేటు చెబుతుందిట" అంది, క్లాక్ టవర్ మీంచి కిందకి గెంతుతుందిట అన్న ధోరణిలో.

"నాక్కూడానా?"

పాప నావేపు అర్థం కానట్టు చూసింది.

"చదువుకోకపోతే చదు వెలా వస్తుందే?" అంది పాపతల్లి కఠినంగా.

"ప్రైవేటు నాకు చెప్పండి. పాప కక్కర్లేదు" అన్నాను. పాపవేపు ఆ 'మేష్టరు' వేపు చూస్తూ. తీరా ఆవిడవేపు చూశాక "ఎందుకు అన్నానా?" అనిపించింది.

"నేను ప్రైవేటు చెప్పను." అంది ఆవిడ. అసలు వున్న "మిస్చీఫ్" అంతా ఆ వదంలో వుంది. అది ఆవిడ గ్రహించింది.

"చెప్తావు." అంది పాప, పాడిచేసేలా చూస్తూ.

"చెపారు-అను" అంది పాప తల్లి, ఓ మొట్టికాయ వేసి. పాప మాటాడలేదు. గురుత్వం వహించను వచ్చిన ఆ మానవురాలు "నేను వస్తానండీ," అంది.

"సరేలెండి. చూద్దాం." అంది పాప తల్లి. ఆవిడ నా దగ్గరకూడా శెలవు తీసుకుని వెళ్ళిపోయింది. "అంటీ ముట్టనట్టు అలా దూరంగా నిలబడితే, ఇవాళ కాదు, రేపుమటుకు దీన్నిలా దగ్గిరికి తీస్తుంది. పాఠా లెలా చెబుతుంది." అంది పాప తల్లి చేతులూ, కళ్ళూ తిప్పుతూ.

"ఆవిడే చెప్తుంది. పాపే వింటుంది." అన్నా.

మర్నాడు సాయంత్రం నేను కాలేజీ నుంచి వచ్చేసరికి ఎదురుగుండా సోఫాలో పాపా, వాళ్ళ "ప్రవేటు మాష్టరూ" కనిపించారు. ఆవిడ నన్ను చూసి మందహాసం చేసింది. అంతే.

ఆవిడ పేరు వివరాలు కనుక్కోడానికి నేను ఎప్పుడూ ప్రయత్నించలేదు. కాని పాపమటుకు ఆవిడ అంటే ఊఁ ఇదైపోయేది. ప్రవేటు మొదలుపెట్టి మూడు నెలలయిందేమో, పాప వాళ్ళ నాన్నగారికి బదిలీ అయిపోయింది. అరుంధతి చాలా విచారించింది. ఆ తరువాత పదిహేను రోజుల నాడు—హఠాత్తుగా అరుంధతి ప్రత్యక్షమయేసరికి ఆశ్చర్యపోయాను.

"పాప బాగా అలవాటయిపోయిందండీ. సాయంత్రాలు ఏం తోచడం లేదు" అంది.

"నిజమేనండి. రండి." అన్నాను ఆహ్వాన పూర్వకంగా. రెండు మూడు రోజులలో పాప పుట్టినరోజు వస్తుందిట. (ఆ సంగతి నాకు తెలీదు) ఎడ్రెస్ ఇస్తే ఒక గౌను ఎంబ్రాయిడరీ చేసిందిట—పంపిస్తుందట.

గౌను చూపించింది. మంచి పనివాడితనం ఉంది అందులో. ఏదో మొక్కుబడి కోసం చేసిన పనిలా లేదు. ఒకవేళ ఈ కమనీయమయిన కళాఖండం వెనక ఏదయినా కన్నీటి గాథ దాగి ఉందేమో—అనుంగు చెల్లి, అలవాటైన అన్న కూతురూ...ఇంకెవరైనా...

నా ఆలోచనకి నాకే చికాకు వేసింది.

"పంపించండి" అన్నాను—గౌను తిరిగి ఇచ్చేస్తూ.

అప్పుడు అడిగేను అరుంధతిని—"మీ రేం చేస్తున్నా"రని. ఇంటర్మీడియేట్ పాసయి, సెకండరీ గ్రేడ్ ట్రైనింగ్ అయిందిట. ఉద్యోగం కోసం చూస్తోంది.

## ధర్మసందేశం

ఇద్దరు పిల్లలు వాదులాడుకొంటున్నారు. ఒకరి మీద ఒకరికి మహాకోపంగా ఉంది.

"ఒరేయ్ నిన్ను కొడతాను తెలుసా" అన్నాడు ఒకడు.

"నిన్ను చంపేస్తాను" అన్నాడు రెండవవాడు.

"నిన్ను నరికేస్తాను" అన్నాడు మొదటివాడు.

రెండవవాడు ఆశ్చర్యం నటించి "నేను చంపేసిన తరువాత ఎలా నరుకుతావురా" అన్నాడు.

సి. శేషగిరిరావు (విజయనగరం)




# జీ వొ తుం వు

"నేనూ బి. ఏ. కి కడతానండీ," అంది నా పుస్తకాలు ఒక్కొక్కటే చూస్తూ.

"మంచిదే." అన్నాను. "అయం మహాత్రో మహామహాత్రోస్తు."

"మరి మీరు సహాయం చేస్తారా?"

"సహాయమా?"

"ఏం?"

"ఏం—ఏమిటండీ. నాకే మొత్తం మీద పర్సెంటు నాలెడ్జి. పరీక్ష చెట్టెక్కుతుందో గట్టెక్కుతుందో! నేను మీకు చేయగల సాయం మానధారణకాక మరేముంది?" అన్నాను, నిజమైన హాస్యం మాట్లాడుతూ.

"నేనేమీ హాస్యాని కనడం లేదు. మీ చదువు అయిపోగానే మీ నోట్సు నాకెవరికీ ఇవ్వకండి." అంది తను సీరియస్‌గా.

"ఇచ్చినా పుచ్చుకున్నవాళ్లు తరువాత తిట్టుకుంటారు. అంతకంటె ముందు మాట నా చదువు అయిపోవాలంటే యూనివర్సిటీ వాళ్లు బి.ఏ ఎత్తేయాలి. ఇప్పుడు ఇంటర్మీడియెట్ ఎత్తేసి కొందరి చదువులు పూర్తి చేసినట్టుగానే."

అరుంధతి నవ్వుతూ "బలేవారండీ మీరు" అంది.

తరువాత అరుంధతి వెళ్లిపోయింది. పై చదువులు చదివించనూ లేక, పెళ్ళి చెయ్యలేక తల్లిదండ్రులు ట్రైనింగుకి పంపించేరు కాబోలు అనుకున్నాను. పెద్ద కుటుంబం కాబోలు. అదే నిజమయితే ఇంకా బి. ఏ. కి కట్టి, బి. ఇడి. కి కట్టి ఎప్పుడు పూర్తి అవుతాయి ఇవన్నీ. వెనక వాళ్ళని ఉద్ధరించే దెప్పుడు? మనిషి కూడా ఖర్చుదారులా కన్పించింది. అరుంధతి విషయంలో ఒక నిర్ణయానికి రాకుండానే తెల్లవారిపోయింది. పుస్తకాల విషయంలో మటుకు ఒక నిర్ణయానికి వచ్చేను. చేతిలో డబ్బు చీరలమీద పెట్టి పుస్తకాలు అప్పు అడిగేవాళ్ళంటే నాకు భయం. అలాటి అప్పు ఇచ్చినవాళ్లకే గాని పుచ్చుకున్నవాళ్లకి జ్ఞాపకం వుండదు. ఇంకొకళ్ళ పుస్తకాలు పారేయడానికున్న నిర్లక్ష్యం తను పుస్తకాల విషయంలో వుండదు.

అరుంధతి బి. ఎ. చదివే అభిప్రాయం ఇనప్పెట్టెలో పెట్టి, మునిసిపల్ గరల్స్ స్కూల్లో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా చేరిందిట. మనసులో ఏ మూలో కలుక్కుమంది.

"అందరిలాగే మీరూ ఆశ్చర్యపోతున్నారా?" అంది తను రోజూ స్కూలుకు నడిచివెళ్లే విషయమై.

"ఆశ్చర్యం కాదు కానీ..." అన్నాను నసుగుతూ.

"మా నాన్నగారు బరంపురంనుంచి కాకినాడ నడిచివెళ్లేరంటే నేనునమ్మను. నేను ఇక్కడ్నుంచి గరల్సు స్కూలుకి నడిచివెళ్తున్నానంటే ఆశ్చర్యపోయేవాళ్ళూ, ముక్కుమీద వేలేసుకునే వాళ్లూ, మూర్ఛపోయే వాళ్లూను" అంది తను.

"తను చెప్పిందాంట్లో నిజం లేకపోలేదు. బస్ కోసం నిరీక్షించే ఓపికలో, బస్‌లో స్థలం కోసం పడే బాధలో, కాలేజ అవ్‌లో బస్ చేసే రొదలో సూరీడంత బాధ వుండదు-నడిచి వెళ్ళడంలో. అయినా ఏమిటో 'నడక' అనగానే అదోలా వుంటుంది...

"ఏమో మా తెద్దురూ. ఎవరేం అనుకున్నా నాకు నడవడం హాయిగా ఉంది."

నిజమే నేమో! పొద్దున తొమ్మిది గంటలకి చేసిన భోజనం, పగలల్లా క్లాసులూ, మళ్ళీ బాబాపు అరమైలు నడిచిన అరుంధతి పనివాడలేదంటే తనకి హాయిగా ఉండే వుండాలి.

"వస్తానండీ." అంది తను లేచి నిలబడుతూ.

"కూచుందురూ. వెళ్ళొచ్చు. తొందరేమిటి?" అమ్మాయి చెయ్యి పట్టుకుని, కూచోపెట్టడానికి ప్రయత్నిస్తూ.

"లేదండీ. వెళ్ళాలి. అరున్నర కొట్టే సరికల్లా మా అత్తగారికి ఫలహారం అయిపోవాలి."

"అత్తగారా!" అనేసి చప్పున నాలుక కొరుక్కున్నాను.

అప్పటివరకూ తన మెడవేపు అంత పరీక్షగా చూడలేదు. నా మొహంలో ఏ సంగతి తనకి నవ్వు తెప్పించిందో చెప్పలేను కాని, "ఒకళ్లు కాదు. ఇద్దరూ" అంటూ నవ్వుతూ వెళ్ళిపోయింది, అరుంధతి.

అరుంధతికి పెళ్ళి అయింది. అరుంధతిని పెళ్ళి చేసుకున్న ఆ పురుషపుంగవుడు రెండు ఎమ్. ఎ. డిగ్రీలు, ఒకలా డిగ్రీ తెచ్చుకున్న బృహస్పతి. అతనికి కన్న తల్లి కాక మరొక పెంపుడు తల్లి—ఇతగాడ్ని పెంచుకున్న తల్లి ఉంది. కన్నతల్లికి ఒక కూతురూ, మరో ఇద్దరు మొగపిల్లలూ ఉన్నారు. పెంచుకున్న తల్లికి ఒక కూతురూ ఉంది. అరుంధతి పెళ్ళి నాటికి ఇంటర్మీడియెట్ పాసయింది. పెళ్ళయిన మూడో నెలనుంచీ అతను ఒకటే గొడవ—"తను ట్రైనింగ్ ఎందుకు కాకూడదని."

"ఆ మాటల్లో అంతర్యం అప్పట్లో నాకు తెలీనే లేదు." అంది అరుంధతి కళ్ళ నీళ్ళు పెట్టుకుంటూ.

అరుంధతి ట్రైనింగ్ పూర్తిచేసిన వారం నాడు తననీ, ఇద్దరు తల్లుల సంపదనీ భరించ కలసిన మగవాడు పరారీ!

అరుంధతి నిశ్చేష్ట అయి నిలబడిపోయింది. అత్తగారు, "జరిగిన సంగతేమిటో నీకు తెలీకుండా ఉంటుందా, నిజం చెప్పు" అని

తననే నిలవేయసాగారు. అతని పెంపుడు తల్లి కూడా ఆ మాటే అంది.

ఆ పరిస్థితులో తాను చేయగలిగింది ఏమీ లేదు. పోనీ, పోదాం అంటే అరుంధతికి పుట్టిల్లు అంటూ ఏమీ లేదు. తల్లి లేదు. తండ్రి కివన్నీ అనవసరమైన అనుబంధాలుగా తోచేయి. పినతల్లీ, పినతండ్రీ అరుంధతికి కన్నెరచెర విడిపించి చేతులు కడుక్కున్నారు. ఇహ ఉద్యోగం చేసి వచ్చిన నాలుగు రాళ్ళతో అత్తా ఆటబడుచులమధ్య కాలం గడపడమే కర్తవ్యం.

"నలుగురు పిల్లలకి ప్రైవేట్లు చెబుదామనుకుంటున్నాను" అని అరుంధతి అన్నప్పుడు ఏమనాలో నాకు తెలీలేదు. ఈ ఆరునెలల్లోనూ తను తోటకూరకాడలా వాడిపోయింది. అవ్యక్తానందంతో మెరిసే కళ్ళు ఆర్ద్రంగా తిరిగేయి. స్నిగ్ధసౌరభాలను వెదజల్లే పెదవి పుచ్చిన చిక్కుడుకాయలా ముడుచుకుపోయింది.

"సాయంత్రం వేళల్లోనూ, మధ్యాహ్నం ఒంటిగంటా రెండు గంటల మధ్య వీలుంటుంది." అంది తనే మళ్ళా.

రూపాయి రూపాయి కోసం రక్తం బొట్టు రాల్చడానికి ప్రయత్నిస్తున్నది. మొదటికే మోసం వస్తుంది—అనుకున్నానాలో నేను.

"ఆరోగ్యం కూడా ఆలోచించుకోండి. మీరు పడుకుంటే మంచి నీళ్ళు అయినా ఎవరూ ఇవ్వరు — లెక్కకి చాలామంది ఉన్నా." అన్నాను.

"అలా ఆలోచిస్తే అందరం పడుకోవలసి వస్తుంది—అనతికాలంలోనే" అని నవ్వింది. ఆ నవ్వులో ఇదివరకులా జీవం లేదు.

అవును. తను తెచ్చే నెలసరి ఆదాయం బియ్యపు బస్తాకి సరిపోతుంది. మధ్య తరగతి వారి బడ్జెట్ అంటూ ఒక కుటుంబంలో ఒక భార్య ఒక భర్త ఇద్దరు పిల్లలూ ఉన్నారనుకుందాం—అంటూ బడ్జెట్ వేసే కుదరదు ఇక్కడ. ఆ యింట్లో ఖచ్చితంగా నలుగురు పెద్దవాళ్ళూ, ముప్పొద్దులా తినే ముగ్గురు పిల్లలూ ఉన్నారు. అందరికీ అన్నీ కావాలి. అసలు అత్తగారికి పొద్దున్న ఫలహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం కాఫీ కావాలి. పెంపుడు అత్తగారికి తొమ్మిదికల్లా భోజనం, మధ్యాహ్నం టీ, రాత్రి చపాతీలు ఫలహారం కావాలి. పెద్ద ఆడబడుచు నియమం నిష్ఠలతో తన పాట్లు తనే పడుతుంది. ఆవిడకి ఈ లోకంతో సంబంధం లేదు. చిన్న ఆడబడుచు స్కూలికి వెళ్తుంది-తోచక. మొగపిల్లలిద్దరిదీ-చద్దన్నం తింటాను, వేడన్నం తింటాను, మావగారితో మళ్ళీ తింటాను—అన్నతంతు.

"వీళ్ళందరితో ఎలా నెగ్గుకొస్తున్నారు" అని నేనంటే.

"పోనిద్దురూ. ఎలా ఉన్నా రోజు గడిచిపోతుంది" అంటుంది అరుంధతి తేలిగ్గా.


## పూవు మీ అదృష్టం చెప్పగలదు



మీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదిన్నీ, మీ సరియైన చర్యనుగురించిన్నీ మీరు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టు కార్డుపైన మీకు యిష్టమగు ఒక పుష్పము పేరున్నూ, మీరు వ్రాయు తేది, వేళ వివరములున్నూ, మీ సరియైన చిరునామా యున్ను వెంటనే వ్రాసి పంపండి.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, మీరు కార్డు వ్రాసిన తేదీలగాయతు 12 మాసములలోను మీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవితమార్గము, ఏ వ్యవహారములో మీకు జయముకలుగునో, మీ ఉద్యోగం విషయంలో మంచిచెడ్డలు, మార్పులు, ఆరోగ్యవిషయము, పరదేశగమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, నిధినిక్షేపములు, లాటరీ, అకస్మాత్ద్రవ్యలాభము మొదలగు వానినిగురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు. 1-4-0 లకు మాత్రమే వి. పి. గా పంపగలము. (వి. పి. చార్జీలు ప్రత్యేకం) దుష్టగ్రహము లేవయినా వున్నయెడల శాంతిచేయు విధానంకూడా తెలుపగలము. వివరములు మా పూచీపైన పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా నుండనియెడల పైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మా అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

Pt DevDutt Shastri, Raj Jyotishi (WP-18) Jullundur City.



## మా అనుభవం—మీ లాభం......

పిల్లల లివర్, స్ప్లీన్ వ్యాధులకు చికిత్స చేయడంలో దాదాపు 60 సంవత్సరాలుగా పొందిన అనుభవంతో జమ్మివారు సరిగా వ్యాధిని నిరూపణచేసి వెంటనే వ్యాధిని నిర్మూలించడానికి సరియైన సలహా ఇవ్వగలరు. మీ పిల్లల లివర్ పరీక్ష చేయించండి. జమ్మివారి డాక్టర్ మీ సమీపంలో గల పట్టణానికి ప్రతివేళా వస్తారు. ఆయన పర్యటన కార్యక్రమం కోసం వ్రాయండి.

పిల్లల లివర్, స్ప్లీన్ వ్యాధులకు



జమ్మివారి

లివర్‌క్యూర్



జమ్మి వెంకటరమణయ్య అండ్ సన్స్

బ్రాంచీలు: 17/283-హింద్ వీధి, గాంధీనగర్, బకింగ్ హాం పేటపోస్టు, విజయవాడ-2. * ఓరుగంటివారి వీధి, విజయనగరం సిటీ. 132/1, మహాత్మాగాంధి రోడ్డు, కలకత్తా.

రోజులు గడిచిపోతాయా!

ఆ తరవాత అరుంధతి నెలా నెలా పది హేను రోజులవరకూ కనిపించలేదు. షష్ఠీశ్వరుల దగిరి కొలువున్నాయి అన్న మాటావిడిలో నేనూ తన విషయం అంతగా పట్టించుకోలేదు.

చలి వేస్తూందని కిటికీ తలుపుల దగ్గర్నుంచీ అన్నీ వేసుకుని కూర్చున్నా. 1868 కన్వెన్షనూ—సూయజ్ కెనాల్—ఏమిటో సెధవ గొడవలు. ఒకడు ఒక తెలివితక్కువ పని చెయ్యడం, మరొకడు మరొక తెలివైన పని చేయడం—తన్నుకోడం, కొట్టుకోడం. వాటికి కారణాలేమిటి? అంటూ ఈ లెక్చరర్లు మమ్మల్ని చంపుకు తింటున్నారు.

ఎవరో తలుపు తట్టి పిలిచినట్టయి, ఖేడివ్ ఇస్మైల్ ని అప్పుల్లో వదిలి తలుపు తీశాను.

అరుంధతి!

"ఇంత రాత్రప్పుడు—ఇలా" అన్నాను ఆశ్చర్యంగా. అప్పుడు అయిదు నిముషాలు తక్కువ తొమ్మిది.

"ఒక యాభైరూపాయలంటే సర్దగలరేమోనని వచ్చేను" అంది సూటిగా చూస్తూ.

ఆ మాట అర్థం కావడానికి నాకు అయిదు నిముషాలు పట్టింది.

"పెట్టెలో బట్టలు సర్దుకోడమే చేతకాదు నాకు" అన్నాను, నవ్వుతూ.

"నేనూ అదే అనుకున్నాను." అంది తను చప్పున.

ఇంతవరకూ అక్కడ సీరియస్ కేస్ లేదనే అనుకున్నాను. "ఎక్కడ్నుంచి వస్తున్నారు? ఏమిటి కథ?" అన్నాను.

తను మహిళామండలి సెక్రటరీగారింట్లో ఇద్దరు పిల్లలికి ట్యూషను చెప్పి వస్తూందిట. రోజూ పొద్దున్న ఏడునుంచీ ఎనిమిదివరకూ ఇద్దరు పిల్లలు ఇంటికి వచ్చి చెప్పించుకు వెళ్ళిపోతారు. వాళ్ళకి పాఠాలు చెబుతూనే వంట చేసుకుంటుంది. తొమ్మిదిన్నర ప్రాంతాల్లో ఓపినంత మటుకు ఫలహారాల వాళ్ళకి ఫలహారాలూ, భోజనాల వాళ్ళకి భోజనాలు సిద్ధపరచి, తనూ రెండు మెతుకులు కొరికి స్కూలికి వెళ్ళిపోతుంది. మధ్యాహ్నానికి ఇంటి దగ్గర్నుంచే ఫ్లాస్కులో కాఫీ పట్టుకెళ్తుంది. మళ్ళీ సాయంత్రం ఓ గంటలసేపు మహిళలకి జాకెట్టు కత్తిరింపులూ అవీ నేర్పుతుంది. ఇంటికి వెళ్ళి మళ్ళీ టిఫిన్లూ, వంటలూ చూసుకోడం. మళ్ళీ వెనక్కి వెళ్ళి ఏడున్నరనుంచి ఎనిమిదిన్నర వరకూ సెకండు ఫారం చదివే ఇద్దరు పిల్లలికి ట్యూషను. ఇవి రెండూ కమిషనర్ దగ్గిర పర్మిషన్ పుచ్చుకుని చెప్తున్నవి. పొద్దున్నవి రహస్యం.

అరుంధతి ఆ యింట్లో ఏ స్వర్గసుఖాలని చవి చూస్తూందో?

"ఎందుకింత తాపత్రయం మీకు?" అని అడిగాను.

"నూరేళ్ళ జీవితం ముప్ఫై ఏళ్ళలో ముగించుకుంటే ఒరిగేదేమిటి? ఎవర్ని మెప్పించడానికి?"

"ప్చ్" అంది తను నా వేపు ఒక చూపు చూసి, "చూద్దాం" ఆ చూపు ఎలాంటిదో చెప్పలేక ఒక చూపు అన్నాను.

"మా చిన్నాడబడుచు పుట్టిన రోజు రేపు వచ్చే శుక్రవారం నాడు. చీరెలూ, సారెలూ తక్కువైతే వీల్లేదు, నాలుగువేళ్ళూ నోట్లోకి పోకపోయినా" అంది అరుంధతి అదోలా నవ్వుతూ.

"ఏం మాటలండీ" అన్నాను. అంతకన్నా ఏమనను? పరీక్ష ఫీజుకని దాచిన మొత్తంలోంచి అయిదు పదులు తీసి, అరుంధతి చేతిలో పెడుతూంటే, తన వదనం కృతజ్ఞతతో జాజ్వల్యమానమయింది. చూడనట్టు నటించాను.

"ఈ డబ్బు నేను మీకు తిరిగి ఇవ్వలేక పోతేనో?" అంది, సహంబాధగా, సహం కోపంగా.

"శిక్ష పడుతుంది." అన్నాను, మిగిలిన డబ్బు పెట్టిలో పెట్టుకుంటూ.

"ఏమిటా శిక్ష."

"ఏముంది. మీ ప్రియబంధువులతో ఎడబాటూ, మా యింట్లో కారాగారవాసమూనూ."

"మంచివారు కదూ. ఆ మాట ముందే చెప్తే మరోపాలిక పుచ్చుకుందును."

"ముందు మీరు అప్పు తీర్చనని ప్రకటించారి కదా" అన్న నా మాటలు గాలిలో కలిసిపోయాయి.

అరుంధతి చిన్నాడబడుచు పుట్టిన రోజు వేడుక ఎంత ఘనంగా జరుగుతుందో ఊహించుకుంటూ ఆ రాత్రి గడిపాను. మర్నాడు అరుంధతి కొన్న కొత్త చీర చూపిస్తుందనీ, తన కోసం పుట్టినరోజు మహోత్సవం చూడ్డానికైనా నన్ను ఆహ్వానిస్తుందనీ (కనీస ధర్మంగా) అనుకున్న నా ఆశలు వమ్ము అయ్యాయి. ఎలా చూసినా తన ఈ పని సమర్థనీయంగా లేదు. ఒకవేళ తనకు ఒంట్లో బాగు లేదేమో—ఆదివారం వెళ్ళి కనుక్కుందాం అనుకున్నాను.

శనివారం పొద్దున్న నాగమణి చెప్పిన వార్త ఇది—అరుంధతి వెళ్ళిపోయింది—కర్పూరం హారించిపోయినట్టు.

నేనిచ్చిన యాభైరూపాయలూ జ్ఞాపకం వచ్చేయి. వెంటనే అలాంటి ఆలోచన వచ్చినందుకు నన్ను నేనే చీవాట్లు వేసుకున్నాను. అయితే అరుంధతి ఎందుకు వెళ్ళిపోయినట్టు?

సాయంత్రం కిటికీ దగ్గర కూచుని సన్నజాజిపూలు మాల కట్టుకుంటూంటే మగపిల్లలిద్దరూ కనిపించారు. పిలిచాను ఒక్కమారు, రమ్మని. పెద్దవాడు ఒకదూకు దూకి వచ్చాడు. చిన్నవాడు అన్నగారి చెయ్యి పట్టుకుని వెనక్కిలాగేడు. గూట్లోంచి బిస్కట్ పాకెట్ తీసి "ఇదిగో. మీ వదిన మీ కివ్వమంది" అన్నాను. ఇద్దరి కళ్ళూ ఆశగా మెరిశాయి. ఇందుకే కాబోలు అమాయకత్వం చూస్తే జాలివేస్తుంది. ఆ పిల్లలిద్దరూ అంగుళం, సెంటిమీటరు చొప్పున జరిగి నాకు గజందూరం వచ్చేసరికి అరగంట పట్టింది.

"మీ వదిన ఎప్పుడు వస్తుంది?"

"ఇహ రాదు."

"ఎందుకు వెళ్ళిపోయింది?"

"ఏమో?"

అంతకంటె ఏమీ తెలుసుకోలేకపోయాను.

కాని ఇలాంటివిషయాలు దాచివాదాగవు.

"అబ్బో ఆదొక్కడ. రాత్రీపగలూ ఆ చీర గడాలూ—అప్పుడే అనుకున్నాను." అన్నారొకరు.

"బాగుంది. చప్పుండేమిటి మరి. మంచి పనే చేసింది" అన్నారింకొకరు. నలుగురు నాలుగు రకాలుగా అనుకున్నారు. ఆఖరికి తేలిందిది :

సాధారణంగా ఆ యింట్లో అరుంధతి మాట సాగదట, అసలు నిజం చెప్పాలంటే ఏ ఒక్కరి మాటా సాగదు. కాని అలా తలొక పెద్ద దండనాయకుడే అంటే అరుంధతికి నచ్చదు. అయినా చేసేది ఏం లేదు కనక ఊరుకొనేది—ఎలా ఉన్నా రోజు గడిచిపోతుంది కదా అని. కాని రోజులు గడిచిపోలేదు. పరదాకి స్కూలికి వెళ్తున్న చిన్నమ్మాయి ఇంట్లో చెప్పకుండా సినిమాకి వెళ్ళేది.

## జీవాతువు

తాత — ఒరేయ్ గోపీ, నా పొడుం కాయ ఇలా పట్రారా.

గోపీ — తాతయ్యా, మరి నువ్వు వైకుంఠం వెళ్లిన తరువాత పొడుం కొనడానికి నీకు డబ్బు ఎక్కడినుంచి వస్తుంది?

తాత — ఓరి పిచ్చివాడా. వైకుంఠంలో నాకేం కొదవరా! నాకంటె ముందు మా నాన్న అక్కడికి కాపురం వెళ్లాడు!

బి. నరసింహం (ఆరణి)

ఆ సంగతి అరుంధతి గ్రహించి నీతులు బోధించబోయింది. దాంతో ఆ పిల్లకి ఒళ్ళు మండింది. "నా యిష్టం నీ కెందుకు?" అంది. పైగా ఇప్పుడు తనకి రెండు వేలు తెచ్చివ్వమంది.

అరుంధతి ఆతురాలా నిశ్చేష్టిత అయి నిలబడిపోయింది.

"దాని విషయంలో నువ్వెందుకు జోక్యం కలగజేసుకోడం?" అంది అత్తగారు సమరస భావంతో.

"అయినా ఈ రోజుల్లో ఎవరంతటి వాళ్ళు వాళ్ళు, పిల్లని తల్లి అంటే పడదు. పని మనిషి వంటిది—మాట అంటే ఆ ముతున్న గిన్నె అక్కడ పారేసి పోతుంది. అలాటిది కాని డబ్బు ఇస్తున్నాం కదా అని స్వవిషయాల్లో జోక్యం కలిగించుకుంటే వినే దెవరు?" అంది పెంపుడు అత్తగారు.

"చిన్నదాన్ని—కోపం వద్దు వదినా—రోజులిలా ఉన్నాయి. ప్రతి మనిషికి తనమీద తన తెలివి తేటలమీద ఉన్న నమ్మకం అతి అయిపోయింది. ఇతరుల దగ్గర్నుంచీ ఇతరుల అనుభవాలనుంచీ నేర్చుకుందాం అన్న జిజ్ఞాస ఉన్నవాడు వెర్రివాడు. అది అడిగిన రెండు వేలూ తెచ్చి, ఇచ్చి అవి అయిపోగానే దానికే బుద్ధి వస్తుంది. అక్కడ కది దవా గాదూ!" అంది దైవచింతనగల పెద్దాడబడుచు. 'రోజులిలా' ఉంటే తనెందుకు ఇలా ఉండాలో అరుంధతికి అర్థం కాలేదు.

"నా డబ్బుపనికొచ్చి, నా మాటపనికిరాక పోతే నేనిక్కడ అనవసరం" అంది అరుంధతి.

అరుంధతి వెళ్ళిపోయింది.

రెండేళ్ళనాడు ఇరవై పోస్టు ముద్రలతో ఒక ఇన్‌లాండ్ కవరు వచ్చింది నాకు. ఆ ముద్రల మధ్యనుంచి ఎడ్రెస్ వ్రాసిన కలం పోల్చుకోడం కొంచెం కష్టమే అయింది. అది అరుంధతిది.

"జరిగిన సంగతి మీరు వినే ఉంటారు. నేను చేసింది సరైనదవునో కాదో—ఆ క్షణంలో ఆవేశంలో అక్కడ్నుంచీ వచ్చేశాను. ఒక చిత్రమైన సంఘటనవల్ల "ఆయన్ని" కలుసుకున్నాను. దైవోపహతురాలిని. పలుదోము పుల్ల కోసం చెట్టెక్కితే సంజీవకరణి దొరికిందన్న ఆశ ఆశగానే మిగిలిపోయింది. వంచింపబడ్డాను మాలతీ, ఇద్దరు పిల్లల్ని నా చేతులమీద వదలి ఆయన "పోయారు." పెంచుతున్నాను—వీళ్ళని."

—వీళ్ళింక పెరిగి పెద్దవాళ్ళయి తనని ఉద్ధరిస్తారని అరుంధతి ఆశపడుతోందని నేననుకోను. అప్రయత్నంగా ఎప్పుడో ఎక్కడో చదివిన పద్యం జ్ఞాపకం వచ్చింది. "నీ చేతను, నా చేతను, వరమడిగిన కుంతి చేతను, వాసవు చేతను, ధర చేతను, భార్గవు చేతను"...ఆరుగురి చేత వంచింపబడ్డాడు మహారథికర్ణుడు. అయితే యేం? ఆఖరి క్షణంవరకూ యుద్ధం చేసి, వీరమరణం పొందాడు.

అరుంధతి జీవిస్తూ ఉంది. ★




NVKR

చలిగాలికి మీ గొంతుక
లోపల కూడా రక్షణ
కావలసి ఉంటుంది



ప్యారీస్ కన్‌ఫెక్షనరీ లిమిటెడ్, మద్రాసు
JWT/PRS/V-1165